
ఆమె కళ్ళు అయస్కాంతాలు!

నయాగారా జలపాతాలు!

పృథివిలోని అందాన్నంతా సొంతం చేసుకుని మెరిసిపోయే వజ్రాల ఖనులు!

ఆమె చూపులు ఎక్కుపెట్టి వదలిన మన్మథ బాణాలు!

ఆమె కళ్లు కేవలం ఆమె ముఖానికే కాదు వెలుగు- ఎదుటి వాడి గుండెల్లో జిలుగు!



ఆ చూపులు ప్రేమ పాశాలు!

అలాంటి ఆమె చూపులు గత పది రోజులుగా తన మీద కేంద్రీకృతమై వుండటం ప్రభాకర్ని పిచ్చివాణ్ణి చేసేస్తూంది.

అతని మతి స్థితి తప్పుతోంది!

# కళ్ళు

## మన్నెం శారద



ఎవరా అమ్మాయి!

తన కోసం ఏ భువినుండో దిగిన అప్సర శిరోమణి కాదు కదా!

ప్రభాకర్ ఆసక్తిగా వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేసేదు.

ఎవరో మాకు తెలియదు! క్రొత్తగా అద్దెకొచ్చేరు అన్నారు మరికొంతమంది!

అందర్నీ యిష్టమొచ్చినట్లు అడగటం బాగోదని ఊరుకున్నాడు ప్రభాకర్.

ఆ యింట్లో మరో యువకుడుంటాడు. కొంప తీసి... అతను...! భయపడ్డాడు ప్రభాకర్.

కాని... తెలిసింది అతను ఆమెకు అన్నయ్యని:

కొండంత ధైర్యంతో ఊపిరి పీల్చుకున్నాడు ప్రభాకర్.

ఆమె ఎవరికీ స్వంతం కాలేదంటే అదో ధైర్యం.

* * *

ప్రభాకర్ రూమ్ తాళం తీస్తూ ఎదురింటి మేడవైపు చూశాడు.

అతని కళ్ళు సంతోషంతో మెరిసేయి!

హుషారుగా ఈల వేస్తూ తాళం తీయడం పటికాస్త

జాప్యం చేసేడు ప్రభాకర్.

మరో అయిదు నిముషాల తర్వాత అతనికి లోపలికి వెళ్లక తప్పలేదు. రూమ్‌లోకి వెళ్ళి ఫేన్ ఆన్ చేసి మంచంమ్మీద కూలబడ్డాడు!

అతని మెదడు నిండా రకరకాల ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి!

కొన్ని నమ్మకాలు! మరికొన్ని అపనమ్మకాలు!

తనని నిరుత్సాహ పరచి నీరస పరిచే అపనమ్మకాల్ని ప్రక్కకి త్రోసి తనని సంతోష పెట్టే ఆశల మీదనే నమ్మకాన్ని పెట్టుకున్నాడు.

అతని మనసు అతన్ని కూర్చున్న చోట కూర్చోనివ్వకుండా ఆడించేస్తున్నది.

ప్రభాకర్ మళ్ళీ ఏదో పని వున్నట్లుగా బయటకెళ్ళి చూసేడు.

ఆమె అలాగే నిలబడి వుంది- ఇటే చూస్తూ.

ప్రభాకర్ చూపులో చూపు కలిపి చూసినా ఆమె తడబడలేదు. పైగా ఆమె నవ్వినట్లు కూడ అనిపించింది.

ప్రభాకర్ ఛాతీ ఆనందంతో ఉప్పొంగింది.

'సందేహం లేదు! ఆమె తనని ప్రేమిస్తున్నది!' అనుకున్నాడు.

స్నానం చేసి అద్దంలో ముఖం చూసుకున్నాడు.

తన ముఖం ఎంతో అందంగా అనిపించిందతనికి. పౌడర్ ఇంకాస్త రాసుకున్నాడు.

ఏం తోచక వీధిలోకి వచ్చి మళ్ళీ అలవాటుగా కిటికీ వేపు చూసేడు. ఆమె లేదు!

కొంచెం నిరుత్సాహంగా అనిపించినా 'ఏదో పని వుండి లోపలికెళ్ళి వుంటుందని మనసుని సరిపుచ్చుకుని రోడ్డంటా నడవసాగేడు.

అతనికి సొంత మేనమామ కూతురు శకుంతల గుర్తొచ్చింది. చిన్నప్పటినుంచీ అనుకున్న సంబంధం. శకుంతల అతని భార్యవుతుందని అందరూ అనుకున్నారు.

'మా ప్రభూగాడికి చేసుకుంటా!' అని అతని తల్లి అందరికీ మురిపెంగా చెప్పడం అతనికి గుర్తుంది.

శకుంతల చాల అందగత్తె.

దుష్యంతుడు వరించిన కణ్వాశ్రపు శకుంతల కూడ అంత అందంగా వుండదేమో!

కాని... ఆమెకు చాల గర్వమని... అందమంటే పిచ్చని అతనికి మశూచి వచ్చేక తెలిసింది.

ప్రభాకర్ బ్రతకడనుకున్నారు- కాని, బ్రతికేడు వికారమైన రూపుతో.

చూపుకూడ పోతుందనుకున్నారు కాని, అతని అదృష్టం కొద్దీ అంత పని జరగలేదు.

కాని... శకుంతల మాత్రం అతన్ని పెళ్ళి చేసుకోనుపొమ్మని తెగేసి చెప్పేసింది.

'చూస్తూ చూస్తూ అంత అందమైన పిల్లని వాడికెలా యివ్వను!' అని అతని మామయ్య తల్లితో చెప్పడం విని తల కొట్టేసినట్లయింది ప్రభాకర్‌కి.

ఆ తర్వాత శకుంతల పెళ్ళి ఒక డాక్టరుతో అయ్యిందని తెలిసి తీరని కసి పెంచుకున్నాడు ప్రభాకర్!

'ఎలాగైనా శకుంతలని మించిన అందగత్తెని చేసుకోవాలి!' అదే అతని కోరిక! ఆశయం!



కాని... తనని చూడగానే ఆడపిల్లలు భయపడినట్లు తప్పుకుంటున్నారే!

వీళ్ళకి శారీరక సౌందర్య మొక్కటే కావాలి! తన మనసెంత మంచిదో ఎవరూ పట్టించుకోరు!

వీళ్ళంతా దీపాల చుట్టూ తిరిగే పురుగులు!

అందుకే మాడి మసై పోతారు.— అనుకున్నాడు కసిగా.

తనకి అందం లేకపోయినా, చదువుంది, మంచి ఉద్యోగముంది! భార్యని సుఖపెట్టడానికి విశాల హృదయం వుంది! ఇవి చాలవా?

అయినా అందం 'చూసే వాళ్ళ కళ్ళల్లో' వుంటుందని తనెక్కడో చదివేడు'

అ రోజు వచ్చినట్లనిపించింది ప్రభాకరానికి.

ఆమె తనని ప్రేమిస్తున్నదేమో!'

అలా అనుకోగానే ప్రభాకర్ కళ్ళు వింతగా మెరిసేయి! అతను తిరిగి యింటి దారి పట్టేడు.

ఇల్లు రాగానే అతని చూపులు ఎదురింటి మీదకి మళ్ళేయి.

ఆ అమ్మాయి అన్నగారు మూసిన తలుపుల దగ్గర నిలబడి పిలుస్తున్నాడు.

"అభినేత్రీ! తలుపు తియ్యి!"

ప్రభాకర్ అలాగే నిలబడి చూడసాగేడు.

ఆమె!

ఆమె వచ్చి తలుపు తీసి నవ్వింది- అన్నగారిని కూడ లెక్క చేయకుండా తనని చూసి!

చీకట్లో కూడ ఆమె కళ్ళు మెరుస్తున్నాయి.

వెన్నెలలో మెరిసే సాగర కెరటాల్లా వున్నాయి ఆమె కళ్ళు!

ఆమె అన్నగారితో లోపలి కెళ్ళింది.

ప్రభాకర్ తప్పుదన్నట్లు రూమ్‌లో కొచ్చేడు.

అతనికి అన్నం సహించ లేదు. నిద్ర పట్టలేదు. కళ్ళ నిండా ఆమె రూపమే నిండిపోయింది.

అభినేత్రి!

ఎంత అందమైన పేరు!

పెదవులు స్పష్టం చేయలేని భావాలని పలికించగల ఆమె కళ్ళకి తగిన పేరు!

ఆ పెద్దవాళ్ళు కనిపిస్తే ఆ పేరు పెట్టినందుకు సాష్టాంగ పడొచ్చు.

ప్రభాకర్‌కి ఆమె ఆలోచనలతోనే తెల్లవారింది.

* * *

ఆ రోజు—

అతను ధైర్యం చేసి ఆమెకు ప్రేమ లేఖ వ్రాసేడు. ఎవరో ఒకళ్ళు ధైర్యం చేసి ముందడుగు వేస్తేనేగా మధ్య దూరం తరిగేది!

'తను మగవాడు' తనే ఆ పని చేయాలి' అనుకున్నాడు ప్రభాకర్.

ఆ వుత్తరాన్ని ఎలా అందచేయాలో తెలియలేదు ప్రభాకర్‌కి.

ఎదురింట్లో క్రింద వాటాలో వున్న ఒక చిన్న పిల్లకి చాక్లెట్సు కొని యిచ్చి ఉత్తరాన్ని యిచ్చిరమ్మన్నాడు మెల్లిగా.

ఆ అమ్మాయి తిరిగొచ్చేవరకూ ఒకటే కంగారు!

"ఎవరికిచ్చేవ్?" అనడిగేడు భయంగా.

"మేడ మీద అక్కయ్యకి!"

"హమ్మయ్య!" అనుకున్నాడు ప్రభాకర్ తేలిగ్గా గాలి పీల్చుకొని.

అటునుండయితే జవాబు రాలేదు కాని... ఆమె చూడటం నవ్వడం మానెయ్యలేదు. అంతకన్నా ఏం కావాలి ఆమె తనని ప్రేమిస్తోందనే నిజం తెలియడానికి.

ప్రభాకర్ ఆమెను చూసి బాహాటంగా నవ్వినా ఎవరూ లేకుండా చూసి సైగలు చేసినా ఆమె ఏమీ అనుకోవడం లేదు.

దాంతో ప్రభాకరానికి బాగా ధైర్య మొచ్చేసింది.

మరో ఉత్తరం వ్రాసి... అడ్వాన్సు అయ్యేడు. మామూలు కథే!

ముచ్చటగా మూడో ఉత్తరానికి బదులుగా ఆ అమ్మాయి రాలేదు కాని... వాళ్ళన్నగారు ప్రభాకర్ రూమ్ వెదుక్కుంటూ వచ్చేడు.

అతన్ని చూడగానే ప్రభాకర్ కాళ్ళు వణికేయి.

"మీరేనా ప్రభాకరంటే?" అడిగేడతను.

"అవును... కాదు... నేనే!" అన్నాడు ప్రభాకర్ కంగారుగా.

ప్రభాకర్ కంగారు చూసి అతను చిన్నగా నవ్వి "నేను అభినేత్రి అన్నగారిని. నా పేరు శ్యామసుందర్!" అన్నాడు అతను.

"నమస్కారం. కూర్చోండి!" అన్నాడు ప్రభాకర్.

లోపల అతనికి చాల భయంగా వుంది. తను రాసిన ఉత్తరాల సంగతి ఆ అమ్మాయి యితని నోటీసులో పెట్టేసిందేమోనని.

"మీరెక్కడ జాబ్ చేస్తున్నారు?" అడిగేడు శ్యామసుందర్.

"ఎల్.ఐ.సి.లో"

"ఏం చదువుకున్నారు?"

"ఎం.కామ్"

"సరే! అసలు సంగతి కొస్తాను. మా చెల్లెలు మీరు వ్రాసిన ఉత్తరాలు చూపించింది." అన్నాడు శ్యామసుందర్ నవ్వుతూ.

"క్షమించండి" అన్నాడు ప్రభాకర్ తలదించుకుని.

"ఇందులో క్షమాపణ ప్రసక్తేముంది? వయసు ప్రభావం అలాంటిది. ఇంతకీ మీరు మా చెల్లెల్ని వివాహం చేసుకుంటారా?" అతను సూటిగా అడిగేసేడు.

ప్రభాకర్ తెల్లబోయి చూసేడతని వైపు.

అదృష్ట దేవత అకస్మాత్తుగా ప్రత్యక్షమై తనని రాజ కుమారుడిని చేసినంత సంబరం కలిగింది.

"మీరు... మీరు... ఒప్పుకుంటున్నారా సార్!" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"మీ యిద్దరికీ యిష్టమైనప్పుడు ఒప్పుకోవడానికేముంది? నా చెల్లిలికి మీ సంగతులన్నీ చెప్పేను. ఆమె అంగీకరించింది. ఇక మీకు ఆమె సంగతులు చెప్పాలి!" అంటూ ఆగి అతనివైపు చూసేడు శ్యామసుందర్.

"అక్కర్లేదండీ! ఆమెను చూస్తేనే తెలుస్తుందిగా!" అన్నాడు ప్రభాకర్ మొగమాటంగా.

శ్యామసుందర్ నవ్వి "మీరెంత వద్దన్నా చెప్పాల్సిన బాధ్యత నా మీద వుంది. నా చెల్లెలి పేరు అభినేత్రి. ఆ సంగతి మీకు తెలుసన్న సంగతి ఉత్తరాల ద్వారా తెలిసింది. ఆమె బి.ఏ. చదువుతూ డిస్ కింటిన్యూ చేసింది."

"చదువు గురించి నాకంత పట్టుదల లేదు లెండి!" అన్నాడు ప్రభాకర్ మధ్యలోనే అందుకొని.

"మాకు తల్లీ తండ్రీ లేరు. ఆమెకు అన్నీ నేనే! మా దురదృష్టం కొద్దీ ఆమె పోయిన సంవత్సరం మా మామయ్యగారి వూరెళ్ళింది. అక్కడ పిడుగు పడటం చూసి... ఆ మెరుపుకి చూపు పోయింది!" అంటూ ప్రభాకర్ వైపు చూసేడు శ్యామసుందర్.

"వ్వాట్?" అన్నాడు ప్రభాకర్.

"అవును నా చెల్లెలు గ్రుడ్డిది! ఇక్కడ ఏదో ప్రకృతి వైద్యం చేస్తారని తెలిసి తీసుకు వచ్చేను!" అన్నాడు శ్యామసుందర్ బాధగా.

ప్రభాకర్ యింకా ఆశ్చర్యం నుండి కోలుకోలేదు.

"మాకున్న ఒకే ఆస్తి ఒక మేడ! అది మాకు చెరి సగమూ దక్కుతుంది. ఉన్నంతలో మీ పెళ్ళి ఘనంగానే జరిపిస్తాను!" అన్నాడు శ్యామసుందర్.

"నన్ను... నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి!" అన్నాడు ప్రభాకర్.

"అలాగే ఆలోచించుకొని చెప్పండి!" అంటూ లేచి వెళ్ళిపోయేడు శ్యామసుందర్.

* * *

ప్రభాకర్‌కి తలచుకుంటూనే మతి పోతున్నది.

అంత అందమైన కళ్ళకి దృష్టి లేదనగానే ఎలాగో అనిపించిందతనికి.


కాని... తను తెలియక పొరబాటు పడితే... ఆ గ్రుడ్డిదాన్ని తనకి అంటకట్టేయాలని చూస్తున్నాడీ తెలివైన అన్నగారు!

చూపులేని దాన్ని చేసుకోవడానికి తనకేం లోపం!

ప్రభాకర్ రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాడు.

ఏం చేయాలి తను! నా కిష్టం లేదని చెప్పేయాలా? అనవసరమైన రొంపిలో దిగేడు తను!

అంతలో అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.



తనని కళ్ళున్న ఏ ఆడపిల్లా పెళ్ళి చేసుకోదు! తన ముఖంలోని వికారాల్ని చూసి వెనక్కు పోతున్నాయి సంబంధాలు! కాబట్టి తనకి పెళ్ళి కావాలనుకుంటే ఈ అమ్మాయిని అంగీకరించడం మంచిది, 'ఎంతో విశాల భావాలతో, ఔదార్యంతో ఆమెని చేపట్టినట్లు నటించాలి. అందుకుగాను తను పూర్తి మేడని కట్నంగా అడిగి తీసుకోవాలి! అలా చేస్తే తనకి అందమైన భార్యతో పాటూ, ఆస్తి కూడ లభిస్తుంది' అని నిర్ణయించుకున్నాడు.

ఆ మర్నాడే ఏ మాత్రం సిగ్గుపడకుండా తన నిర్ణయాన్ని చెప్పేసేడు ప్రభాకర్.

"నాకు నాలుగు లక్షలిస్తామని వస్తున్నారండీ! అభినేత్రి అంటే నా కిష్టం కాబట్టి యింతకు దిగజారుతున్నాను. అదీగాక గుడ్డిపిల్లని కోడలిగా తెచ్చినందుకు మా అమ్మ ఎన్ని మాటలంటుందో!" అంటూ.

శ్యామసుందర్ నవ్వి "దాన్దేముంది లెండి. ఈ సంగతులన్నీ మా చెల్లెలితో మాట్లాడుతాను!" అంటూ వెళ్ళిపోయేడు.

'అతని తీరు చూస్తుంటే ఒప్పుకునేలానే వున్నాడు. ఒప్పుకోక ఏం చేస్తాడు. గుడ్డి చెల్లెల్ని వదలించుకోవడమంటే మాటలా!' అనుకున్నాడు ప్రభాకర్ గర్వంగా.

ఆ రోజు సాయంత్రం కాస్త బింకంగా వుండాలనే కావాలనే ఎదురింటి మేడవైపు చూడకుండా తిన్నగా రూమ్‌వైపు నడిచేడు ప్రభాకర్.

మనసు ఒక పక్కన ఆ అమ్మాయి నిర్ణయం తెలుసుకోవాలని తెగ ఆత్రుత పడుతున్నది. అయినా మనసుని కంట్రోల్ చేస్తూ రూమ్ తాళం తెరిచేడు.

ఎదురుగా కిటికీలోంచి విసిరి వేయబడ్డ ఒక కవరు కనిపించిందతనికి.

పరిచయం లేని ఆ అందమైన దస్తూరిని చూస్తూ గబగబా కవరు తెరచి ఉత్తరం చదవసాగేడు.

పెళ్ళికొడుకు గారికి,

ఎదురింటి పెళ్ళికూతురు నమస్కరించి వ్రాయునది. గ్రుడ్డిది ఉత్తరమెలా వ్రాస్తుందని ఆశ్చర్యపోతున్నారా? మా అన్నయ్యకి డిక్టేట్ చేస్తున్నాను లెండి. మీ నిర్ణయం విని మన దేశంలో ఇంత ఆదర్శమైన యువకులున్నారా అని ఆశ్చర్యపోయేను సుమండీ! నా కళ్ళని తెగ వర్ణించిన మీరు నాకు చూపు లేదని డిజప్పాయింట్ కావడం సహజం. సారీ, నేను గ్రుడ్డి పిల్లను పెళ్ళి చేసుకోనని మీరు చెప్పి వుంటే... నేను బాధపడి వుండేదాన్ని కాను. మిమ్మల్ని తప్పు పట్టి వుండేదాన్ని కూడ కాదు.

కాని... మీరు మా అన్నయ్యకి రావాల్సిన వాటా కూడ యిస్తే నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పేరట! అప్పుడు నాకు కళ్ళు కనిపిస్తాయా? ఏంటో ఈ తిరకాసు నాకర్థం కాలేదు. మీరు నన్నంతగా ప్రేమించి ఇలాంటి కండిషన్ పెట్టడం ఏం బాగుంది చెప్పండి! ఆ మాటకొస్తే మీ ముఖం అంత వికారంగా, చూడగానే వాంతి వచ్చేలా వున్నా (మా అన్నయ్య వర్ణన) నేనేమన్నా కండిషన్స్ పెట్టేనా?

ఇది నిజంగా చాల దురదృష్టం. పోనీలెండి మన యిద్దరికీ రాసి లేదని సరిపుచ్చు కుంటాను—

ఇట్లు మీది కాలేని

అభినేత్రి.

గమనిక:—

నా అసలు పేరు శాంత. నేను సైకాలజీ స్టూడెంటుని. మీ దగ్గరికి రాయబారం వచ్చినవాడు నా మేనత్త కొడుకు. వికారమైన మనిషికి అందమైన మనసుంటుందని అతను బెట్ వేస్తే నేను మీ మీద ప్రాక్టికల్సు చేసేను. టేకిట్ ఈజీ. పోతే ఈ ఉత్తరం నేనే స్వయంగా వ్రాసేను. ఇప్పుడర్థమైందిగా ఎవరు గ్రుడ్డివాళ్ళో! బైదిబై ఈ లెటర్ అందేనాటికి నేను ఊళ్ళో ఉండను! టా! టా!

ఉత్తరం పూర్తిచేసిన ప్రభాకర్ ముఖం జలగలు పీకినట్లు తయారయ్యింది.

*